## క్లుప్తంగా

### 'స్వచ్ఛంద సంస్థలు మద్దతు తెలిపాలి'

కాశీబుగ్గ: గత 40 ఏళ్లగా ఎటువంటి ఉపయోగం లేకుండా కాశీబుగ్గ బస్టాండ్ పక్కన ఉన్న 1.12 సెంట్ల ఆర్అండ్బీ స్థలాన్ని జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘాల సమాఖ్య సంస్థ ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకొని రిక్రియేషన్ క్లబ్ నిర్వహించుటకు నిర్ణయించడమైందని ఆ సంఘ వ్యవస్థాపకుడు డి.ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజా భాగస్వామ్యం చేయుటకు గాను పట్టణ పరిధిలోని అన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అభివృద్ధిని ప్రోత్సహించే పెద్దలతో ఆదివారం సాయంత్రం 4 గంటలకు లైన్స్ క్లబ్ పలాస నందు సమావేశం ఏర్పాటు చేయడానికి నిర్ణయించడమైనదన్నారు. ప్రతి ఒక్కరూ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

మందస: మండలంలో క్షయవ్యాధితో బాధపడుతున్న రోగులకు పౌష్టికాహారాన్ని శనివారం పంపిణీ చేశారు. మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెడ్క్రాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. క్రమం తప్పకుండా రోగులు మందులు వాడాలని, పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ టి.శైలజ సూచించారు. కార్యక్రమంలో రెడ్క్రాస్ టీమ్ మేనేజర్ చిన్నారావు, పీహెచ్ఎన్ పెంటమ్మ, హెచ్వీ బి.కాంతమ్మ, ఫార్మాసిస్టు లీలారాణి, ల్యాబ్ టెక్నీషియన్ వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సత్సంగ సమావేశం



సత్సంగం నిర్వహిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని గంగరాం గ్రామంలో ఉన్న కోదండ రామాలయంలో తూర్పుగోదావరి జిల్లా పేరవరం గ్రామానికి చెందిన సత్యానందగిరి ఆధ్వర్యంలో ఘనంగా ఆధ్యాత్మిక సత్సంగ సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం నారాయణ సేవ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లేశ్వరరావు, ఊడికిలపాడు శ్రీరామకృష్ణ ఆశ్రమం అధ్యక్షుడు సనపల కరుణ్కుమార్ పాల్గొన్నారు.

### రసవత్తరంగా కబడ్డీ పోటీలు



హోరాహోరీగా సాగుతున్న పోటీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని దుక్కవానిపేట గ్రామంలో నీలమ్మ తల్లి ఉత్సవాలు సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. శనివారం మురిపింటివానిపేట జట్టుపై కొండవూరు, చిన్నమురహరిపురం జట్టుపై మామిడిపల్లి విజయం సాధించాయి. రాత్రి వేళ కూడా పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు రిఫరీలుగా వ్యవహరిస్తున్న ఈ పోటీల్లో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### 'టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలదే'



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని, ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని ఎంపీ రామ్మోహన్నాయుడుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ.. ప్రజలకు టీడీపీ మేనిఫెస్టోను వివరించాలని సూచించారు.

### అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ 63వ జన్మదిన వేడుకలు పలాసలో తాళభద్ర బాబూరావు, గొలుసు వాసుదేవరావుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో బాలకృష్ణ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేయడంతో పాటు, ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మద్దిల రాజు, దేవ, గోవర్ధన్, వసంత్ రెడ్డి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ
- కంచిలిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కంచిలి: వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల కేంద్రం కంచిలి-1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు పైల దేవదాస్రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మిడి రామదాసు, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ బాబూరావు, బొగాబెణి ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావు, బీన ఢిల్లీరావు, కుణితి తిరుపతి, సచివాలయ పార్టీ కన్వీనర్లు జోగేశ్వర చౌదరి, డొక్కరి కొగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ కార్యాలయం ప్రారంభం నేడు



తుది మెరుగులు దిద్దుకుంటున్న పార్టీ కార్యాలయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాత టెక్కలి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పాత టెక్కలి ఎంపీటీసీ సభ్యుడు బాలక శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కార్యాలయాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి మాట్లాడతారని పేర్కొన్నారు. పూండి ఉద్దానం ప్రాంతంలో పార్టీ కార్యాలయం నిర్మించడం సంతోషంగా ఉందని, పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని బాలక శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కంచిలి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బలియాపుట్టుగ గ్రామ కూడలి వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కవిటి మండలం ఆర్.బలియాపుట్టుగ గ్రామానికి చెందిన బొగియా గోపాల్ అనే వ్యక్తి తన సైకిల్ మీద బలియాపుట్టుగ గ్రామానికి వస్తుండగా, ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్ తలపైన, కుడికాలి తొడపైన గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ వాహనంలో సోంపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో బరంపురం మెడికల్ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పోస్టర్ ఆవిష్కరణ



గర్జన పోస్టర్ ఆవిష్కరణలో నాయీ బ్రాహ్మణ పెద్దలు

కాశీబుగ్గ: ఈనెల 27వ తేదీన శ్రీకాకుళంలో జరగనున్న నాయీ బ్రాహ్మణ గర్జన పోస్టర్ను పలాసలో ఆ సంఘం టెక్కలి డివిజన్ అధ్యక్షుడు కర్రెన్న ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. తరాలు మారినా నాయీ బ్రాహ్మణుల తలరాత మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణనతో బీసీఏలో కులాల స్థితిగతులను మదింపు చేసి, బీసీఏ కేటగిరీలో వర్గీకరణ చేసేందుకు ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్షవర వృత్తిదారులకు 50 సంవత్సరాలకే పింఛన్ అందించాలని కోరారు. కుల వృత్తిలో కొనసాగుతున్న ప్రతి ఒక్కరికీ చేయూత పథకాన్ని వర్తింపజేయాలన్నారు. చట్టసభలో నాయీ బ్రాహ్మణులతోపాటు ఇతర ఎంబీసీలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాళ్లపేట మల్లేశ్వరరావు, వీరాస్వామి, మేఘవరపు లక్ష్మీనారాయణ, తాళభద్ర గోపి, నాగరాజు, లావేటి కృష్ణారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



పూజలు అందుకుంటున్న అమ్మవారు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చినవంకలో పెద్దమ్మోరు తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతార్పణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఆరోగ్యం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న విశ్వనాథ్బాయ్

కవిటి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని దివ్య దర్శన సంఘం ప్రవచనకర్తలు విశ్వనాథ్ బాయ్, ధనంజయ్ బాయ్ అన్నారు. శనివారం కవిటిలో దివ్యదర్శన సంఘం 14వ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక ప్రసంగాన్ని చేశారు. మనిషి ఉరుకులు పరుగుల జీవితంలో ఆధ్యాత్మికత నుంచి దూరంగా జరగడం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాడని పేర్కొన్నారు. ఆధ్యాత్మికత అంశాలపై ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా మనిషి మానసిక రుగ్మతల నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు.

### నేటి నుంచి గార పోలమ్మ తల్లి ఉత్సవాలు



గ్రామ దేవత గార పోలమ్మ తల్లి

వజ్రపుకొత్తూరు: మండలంలోని సుంకర జగన్నాథపురం గ్రామం గార పోలమ్మ తల్లి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం దేవర తెచ్చే కార్యక్రమంతో మొదలై ఘటాలతో ముగ్గులు పోసి చల్లదనం చేసిన అనంతరం, మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### తక్షణ సాయం అందజేత



తక్షణ సాయం అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన బిసాయి తేజేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి చేతులమీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పందిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 90 శాతం రాయితీపై వరి విత్తనాల పంపిణీ

మెళియాపుట్టి: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. శనివారం మండలంలోని గొడ్డ గ్రామంలోరైతులకు వరి విత్తనాలను 90 శాతం రాయితీపై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతులకు ఏ ప్రభుత్వాలు ఇవ్వని రీతిలో జగనన్న ప్రభుత్వం రాయితీలను కల్పిస్తుందన్నారు. బస్తా విత్తనం ఖరీదు రూ.1143 అయితే ప్రభుత్వం కేవలం రూ.120 లకే అందిస్తుందన్నారు. కంది విత్తనాలు గట్లపై వేసుకుని అధిక ఆదాయం పొందేవిధంగాలా ప్రభుత్వం నుంచి ఉచితంగానే అందిస్తున్నామన్నారు. ప్రతీ గిరిజన రైతు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో ఆర్వోఎఫ్ఆర్ రైతులకు కూడా రైతు భరోసా జమ అయిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల వైఎస్సార్సీపీ నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, మండల కన్వీనర్ పల్లి యోగి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## చింతలపోలమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామం సువర్ణపురంలో గ్రామ దేవత చింతల పోలమ్మ ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామ ప్రజలు మేళతాళాల నడుమ బాణసంచాతో పొలిమేర నుంచి ఊరేగింపుగా స్వాగతం పలికారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## సేవలు అభినందనీయం



సూర్యనారాయణను సన్మానిస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు

సోంపేట: కార్మిక సహాయాధికారిగా పి.సూర్యనారాయణ అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. ఆయన ఇటీవల బదిలీపై రంపచోడవరం వెళ్లడంతో రోటరీ క్లబ్లో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కార్మిక సంఘాల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, ఉపాధ్యాయుడు నగిరి శరత్, సోంపేట ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## విజయమే లక్ష్యంగా పనిచేయాలి

హిరమండలం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్సీపీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. హిరమండలం మండల కేంద్రంలో గల సత్యనారాయణ కల్యాణ మండపంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై పార్టీ మండల కన్వీనర్ మీసాల రామకృష్ణ అధ్యక్షతన మండల నాయకులతో శనివారం సమీక్ష నిర్వహించారు. మండలంలోని 13 సచివాలయాల్లో 9 సచివాలయల్లో గడపగడపకు కార్యక్రమం పూర్తిచేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. సీఎం జగన్మోహన్రెడ్డి ఇచ్చిన మాటప్రకారం వంశధార ప్రాజెక్ట్ నిర్వాసితులకు రూ.216.17 కోట్ల అదనపు పరిహారం మంజూరుచేశారని గుర్తుచేశారు. ఇప్పటికే రూ.162 కోట్ల పరిహారం అర్హుల బ్యాంకు ఖాతాల్లో జమచేశామని, మిగిలిన మొత్తం త్వరలో అందిస్తామన్నారు. టీడీపీ అరాచక పాలనకు స్వస్తి పలికి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్మోహన్రెడ్డికి ప్రజలంతా తోడుగా నిలబడాలని కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, సుందరమ్మ, చిరంజీవి, చిన్నయ్య, అప్పన్న, వైఎస్సార్సీపీ నాయకులు మీసాల రామారావు, మాధవరెడ్డి, శ్రీనివాసరావు, సురేష్, ఆనందరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి

- వైఎస్సార్సీపీ నాయకురాలు దువ్వాడ వాణి
- మలగాంలో గడప గడపకూ మన ప్రభుత్వం

సంతబొమ్మాళి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని మలగాం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనునిత్యం ప్రజల కోసం ఆలోచిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేరుగు రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైఎస్సార్సీపీ నాయకుడు సురాడ వెంకటేష్, కొండయ్య, సవరయ్య, ఎం.రవణమూర్తి, పి.మేనకేతనరెడ్డి, ఎం.అప్పారావు, ఎన్.భీమారావు, పి.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యోగా క్రీడాకారుడికి మంత్రి అభినందన



శ్రీకాంత్ మహంతిని అభినందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఇచ్ఛాపురం: అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు శ్రీకాంత్ మహంతిని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు అభినందించారు. ఒడిశాలోని భువనేశ్వర్ సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ప్రాంగణంలో యూవైఎస్ఎఫ్ (యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్రం తరపున శ్రీకాంత్ మహంతి పాల్గొని బంగారు పతకం సాధించారు. మంత్రి ధర్మానను శ్రీకాకుళంలోని తన క్యాంప్ కార్యాలయంలో శ్రీకాంత్ మహంతి శనివారం మర్యాద పూర్వకంగా కలవగా అతన్ని అభినందించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## 'వారాంతపు సంతకు సహకరించాలి'



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న చైర్మన్ బళ్ల గిరిబాబు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు తలమానికంగా నిలుస్తున్నటువంటి శుక్రవారపు సంతకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు కోరారు. శనివారం బస్టాండ్ సమీపంలో ఉన్నటువంటి సంత మైదానంలో పర్యటించి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది చిరువ్యాపారులు వస్తుంటారని వారికి పోలీసులు, అధికారులు సహకరించాలన్నారు. సంత జరిగిన వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించాలని కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ దేవదాస్రెడ్డి తదితరులు

కంచిలి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీపీ పైల దేవదాస్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బలియాపుట్టుగ కాలనీ శాఖా గ్రంథాలయం ఆవరణలో గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు అధ్యక్షతన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, నేతలు ఇప్పిలి కృష్ణారావు, సాహుకారి చిరంజీవులు, సచివాలయ పార్టీ కన్వీనర్లు జోగేశ్వర చౌదరి, డొక్కరి కొగయ్య, శ్యామ్ ప్రభ, రత్నాల భాస్కరరావు, పైల జోగారావు పాల్గొన్నారు.

## ఘన జీవామృతంతో బహుళ ప్రయోజనాలు



ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

కొత్తూరు: ఘనజీవామృతంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని సోమరాజపురంలో 400 కిలోల ఘనజీవామృతాన్ని శనివారం తయారుచేశారు. ఖరీఫ్లో సాగు చేయనున్న వరి పొలంలో నవధాన్యాల సాగుకు ముందు ఎకరాకు 400 కిలో ఘనజీవామృతం వేయడం వల్ల ఆరోగ్యకరమై పంట పండుతుందన్నారు. రసాయిన ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా తయారుచేసిన ఘనజీవామృతంతో భూమి సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ప్రతీ రైతు ఘనజీవామృతాన్ని తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.